కళాశాల విద్యార్థుల చిన్న చిన్న కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

# ఎదలో యలలో

అలా చూడకూడదని తెలుసు కాంతారావుకి.

అలా చూడ్డం తప్పనీ తెలుసు!

తదేకంగా అలా చూస్తే తరవాత జరిగే ప్రమాదం కూడా తెలుసు.

అయినా చూడకుండా వుండలేకపోతు న్నాడు.

పద్దెనిమిదేళ్ళ యవ్వనం.

సౌందర్యపు పూలరాసి పోసినట్టు—

కళ్ళ ముందు కనిపిస్తూ—ఎదలోని కోరికను కదలిస్తోంది.

"ఛ! తప్పు!" అనుకొని గోడవేపు తిరిగి పడుకున్నాడు.

ఊహు! కళ్ళు మూసినా తెరిచినా అదే రూపం కళ్ళముందు కదుల్తోంది.

వెల్లికిలా తిరిగి ఎదురుగా నున్న కిటికీ లోంచి బయటకు చూశాడు. బయట గంట క్రితం నుండీ పడుతున్న వర్షం చిన్న తుంపరగా మారింది. కిటికీలోంచి చలి గాలి శరీరాన్ని తాకి గిలిగింతలు పెడుతూ ఎదలోని కోరికకు వేడి పుట్టిస్తోంది.

మంచానికి దిగువున చాపపై హాయిగా నిద్రపోతోంది కాంతారావు మరదలు సుజాత. సీలింగ్ ఫ్యాన్ గాలికి ఆమె ముంగురులు అందమైన ఆమె ముఖంపై నాట్యమాడుతున్నాయి. నిద్రలో పైట జారింది.

ఓసారి భార్య మంచం వైపు చూశాడు. కొంచెం దూరంలో మంచంపై నిద్ర మాత్రల మత్తులో హాయిగా నిద్రపోతోంది లక్ష్మి.

మొదటి కాన్పు కష్టం కావడంతో ఆపరేషన్ చెయ్యవలసి వచ్చింది ఆమెకు. అతి కష్టంమీద బిడ్డ దక్కకపోయినా తల్లి ప్రాణాలు కాపాడగలిగారు డాక్టర్లు.

తనో మాతృమూర్తిగా పాపతో ఎలా ఆడుకోవాలో రోజులు ఎంత ఆనందంగా దొర్లించేయాలో వూహించుకొని భవిష్యత్‌ని ఓ సుందర స్వప్నంగా మలచుకున్న ఆమెకు ఇదో పెద 'షాక్' అయింది. ఆ కారణంగా నిద్రకు దూరమైన ఆమెను నిద్ర మాత్రలు వాడమన్నారు డాక్టర్లు.

అక్క ఆరోగ్యం కొంత కుదుటపడేవరకూ ఇంటి పనులు చేయడానికి వచ్చింది సుజాత.

రోజంతా పనులతో అలసిపోయిన శరీరంతో రెండు మంచాలకూ మధ్యన 'చాప' వేసుకొని మత్తుగా నిద్రపోతోంది సుజాత.

బయట కురుస్తున్న వర్షం—ఎదలో కదులుతున్న కోరికా—నరాలను వేడెక్కిస్తుంటే—

నెమ్మదిగా మంచం దిగాడు కాంతారావు.

చప్పుడు చెయ్యకుండా సుజాత ప్రక్కనే కూర్చున్నాడు. మెల్లగా మెల్లగా ఆమెపై చెయ్యి వేశాడు.

"ప్లీ జ్ డి య ర్ !" సుజాత కదిలింది అస్పష్టంగా గొణుగుతూ.

భయపడిపోయాడు కాంతారావు. చెయ్యి తీసేశాడు. ఆమె గొణిగిన అక్షరాలు కూడబలుక్కొని మరోసారి మననం చేసుకున్నాడు. "ప్లీజ్ డియర్" కొంపదీసి నిద్ర నటిస్తోందా? మళ్ళీ చెయ్యి

"ప్లీజ్ రాజా! నీకెన్నిసార్లు చెప్పాలి? పెళ్ళి కాకముందు ఇలాంటి పనులు నాకు నచ్చవని ఇలా అయితే రేపటినుండీ నేనింక రాను" నిద్రలో కలవరిస్తోంది సుజాత.

ఉలిక్కిపడ్డాడు కాంతారావు.

'మై గాడ్! తన తొందరపాటు ఎంత ఘోర పరిస్థితిని తెచ్చిపెట్టి వుండేది? . ఇద్దరు ప్రేమికుల జీవితాలు శాశ్వతంగా నాశనమై వుండేవి ఛ! తను ఇవాళ ఎందుకిలా ప్రవర్తించాడు?' నొచ్చుకుంటున్నాడు కాంతారావు.

ఇంట్లో చాపపై అలాగే హాయిగా నిద్రపోతోంది సుజాత ఏదో సుందర స్వప్నంలో విహరిస్తూ. □

—జ్యోత్స్న (ఇంటర్)
రాయగడ కాలేజీ, ఒరిస్సా.